# జూన్ నుంచి పెన్‌కల్చర్

- అధునాతన పద్ధతిలో చేపల పెంపకానికి మత్స్యశాఖ శ్రీకారం
- ఆరు ప్రాంతాలను ఎంపికచేసిన అధికారులు
- కోల్‌కతా శాస్త్రవేత్తలతో ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమీకృత మత్స్య అభివృద్ధి పథకం(ఐఎఫ్‌డీఎస్)లో భాగంగా తెలంగాణలో పెన్‌కల్చర్‌ను అమలు చేసేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా చేపపిల్లల పంపిణీ, ఆధునిక వసతుల కల్పనతో రాష్ట్రంలో మత్స్యసంపద పెంచుతున్నది. తాజాగా జూన్ నుంచి పెన్‌కల్చర్ పద్ధతిలో చేపలు పెంచాలని నిర్ణయించింది. ఈ విధానంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు కోల్‌కతా నుంచి శాస్త్రవేత్తలను రప్పించారు. పెన్‌కల్చర్‌కు అనుకూల వాతావరణం ఎక్కడ ఉన్నదో గుర్తించేందుకు ఉన్నతాధికారులు, నిపుణులు విస్తృతంగా పరిశోధిస్తున్నారు. ఇప్పటికే 15 రిజర్వాయర్లను పరిశీలించారు. వీటిలో ఆరింటిని ఎంపికచేసి ప్రయోగాత్మకంగా చేపలు పెంచాలని



భావిస్తున్నారు. ఇందుకోసం రూ.కోటి ఖర్చుచేయనున్నట్టు అధికారులు తెలిపారు.

**తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి**

పెన్‌కల్చర్‌లో పెట్టుబడి తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా చెరువుల్లో పెంచే చేపలకు రోజూ ఆహారం అందించాల్సి ఉంటుంది. కానీ పెన్‌కల్చర్‌లో చేపలు జలాశయాల్లోనే ఆహారాన్ని సమకూర్చుకుంటాయి. అవసరమైన సందర్భాల్లోనే బయటి నుంచి అందిస్తారు. చేపలను బాగా పెంచడంతోపాటు చేపపిల్లల ఉత్పత్తికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సాధారణ పెంపకానికి నాలుగు నుంచి పది రెట్లు ఎక్కువగా చేపల ఉత్పత్తి ఉంటుందన్నారు. దాదాపు 250 ఎకరాల్లో పెన్‌కల్చర్‌ను అమలులోకి తేవచ్చని, హెక్టారుకు నాలుగు టన్నుల వరకు ఉత్పత్తి ఉంటుందని వివరించారు. ఈ విధానంలో చేపల పెంపకానికి ముందుకొచ్చేవారికి 90 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

## పెన్‌కల్చర్ అంటే.?

రిజర్వాయర్లు, పెద్ద చెరువుల్లో ప్రత్యేకంగా కొంత ప్రాంతాన్ని ఎంపికచేస్తారు. వెదురు, చెక్కలు, ఇతర సామగ్రి సాయంతో నీటి అడుగు నుంచి ఉపరితలం వరకు కంచె ఏర్పాటు చేస్తారు. దీనినే పెన్ అంటారు. ఆ పరిధిలో చేపలు పెంచుతారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఈ విధానం అమలులో ఉన్నది.

## పెన్‌కల్చర్‌కు తెలంగాణ అనుకూలం: సువర్ణ, మత్స్యశాఖ కమిషనర్



పెన్‌కల్చర్‌ను జూన్‌లో ప్రారంభించి, క్రమంగా విస్తరిస్తాం. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పైలట్ ప్రాజెక్టును చేపడుతాం. జార్ఖండ్, అసోం రాష్ట్రాల్లో మంచి ఫలితాలు రావడంతో తెలంగాణలోనూ మొదలుపెట్టాలని నిర్ణయించాం. కొన్నిదేశాల్లో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోనే పది టన్నుల వరకు చేపలు ఉత్పత్తి చేస్తున్నారు. ఆ విధానాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నాం.